ప్రజాశక్తి
www.prajasakti.com
శనివారం 11 మార్చి 2023
5
అన్నమయ్య

కుక్కల దాడిలో జింక మృతి

ప్రజాశక్తి-రామసముద్రం

మండలంలోని కాప్పల్లి పంచాయతీ బైరాజుపల్లి గ్రామం సమీపంలో కుక్కల దాడిలో జింక మృతి చెందింది. దాడిలో తీవ్రంగా గాయపడిన జింకను స్థానికులు సంబంధిత అధికారులకు సమాచారం అందించారు. హుటాహుటిన అక్కడకు చేరుకుని ప్రథమ చికిత్స అందించే క్రమంలో మృతి చెందింది. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీదేవి, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ అర్జున్ కుమార్ ఆధ్వర్యంలో కాప్పల్లి డంపింగ్ యార్డ్ సమీపంలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేశారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ దినేష్, మంజునాథ్, శానటరీ వర్కర్లు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మృతి చెందిన జింక

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- ఎంపీ మిథున్‌రెడ్డికి ఛాలెంజ్
- టిడిపి హయాంలోనే అభివృద్ధి
- పాదయాత్ర సభలో నారా లోకేష్
- టిడిపిలో చేరిన కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే

బహిరంగ సభలో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఎవరి హయాంలో అభివృద్ధి జరిగింతో చర్యకు సిద్ధమా పాపాల పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఛాలెంజ్ చేశారు. శుక్రవారం 40వ రోజు స్థానిక దేవతానగర్ నుండి పాదయాత్రను ప్రారంభించారు. అక్కడి నుండి అంబేద్కర్ సర్కిల్ మీదుగా సుందర్య సర్కిల్, బెంగళూరు బస్టాండ్, అనిబిసెంట్ సర్కిల్ మీదుగా ఎన్టీఆర్ సర్కిల్ కు చేరుకుని అక్కడ ఎన్టీర్ విగ్రహానికి పూలమాలలు వేసి సాదయాత్ర కొనసాగించి. సాయంత్రం స్థానిక అమ్మిచెరువు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ మిథున్‌రెడ్డికి ఛాలెంజ్ చేస్తున్నా ఎవరి హయాంలో జిల్లా అభివృద్ధి చెందిందో చర్చకు నేను సిద్ధం, శనివారం తంబళ్లపల్లెలో ఉంటా మిథున్‌రెడ్డి వస్తే చర్చకు నేను సిద్ధమని పేర్కొన్నారు. టిడిపి హయాంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కంపెనీలు తెచ్చి ఉద్యోగాలు కల్పించింది, సాగు నీటి ప్రాజెక్టులు పూర్తి చేసింది టిడిపినేనన్నారు. ల్యాండ్, సాండ్, వైన్, మైన్ మాఫియాలు తెచ్చింది పాపాల పెద్దిరెడ్డి కుటుంబమని ఆరోపించారు. నాలుగేళ్లలో పెద్దిరెడ్డి కుటుంబం దోచుకుంది రూ.10 వేల కోట్లన్నారు. మదనపల్లికి కంపెనీలు రాకపోవడానికి పెద్దిరెడ్డి కుటుంబమే కారణమన్నారు. జగన్ సీన్ అయిపోయిందని, రాబోయేది టిడిపి ప్రభుత్వమని రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేది తామేనని పేర్కొన్నారు. మదనపల్లిలో అధికారిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా, అనధికార ఎమ్మెల్యేలు పాపాల పెద్దిరెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి. తమిళనాడు రిజిస్ట్రేషన్‌తో చేసిన లారీలతో ఇక్కడ కొండలను తవ్వి గ్రావెల్ తరలిస్తున్నారని ఆరోపించారు. దళితులకు చెందిన టికెటి భూములు లాక్కుని మైనింగ్ చేస్తున్నారని, ఎమ్మెల్యే నవాజ్ బాషా తన బినామీలతో బెంగళూరు బస్టాండ్ పరిధిలోని షాపింక్ కాంప్లెక్స్ నుండి రూ.ఐదు లక్షలు వసూలు చేస్తూ సొంతానికి వాడుకుంటున్నారన్నారు. 557 ఎకరాలు ఉన్న సిటిఎం చెరువును స్థానిక ఎమ్మెల్యే, తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి అనుచులు 30 ఎకరాలు కాజేశారని, కరోనా వస్తే షాపులు, రెస్టారెంట్లు, బంగారం కొట్ల నుండి రూ.4 కోట్లు వసూలు చేశారన్నారు. జిల్లా పెద్దిరెడ్డి కుటుంబం చేతిలో ఉండాలని మదనపల్లిని జిల్లా కాకుండా అడ్డుకున్నారని, చర్చకు నేను సిద్ధమని,. ప్రజల తరపున నేను పోరాటానికి సిద్ధంగా ఉన్నానన్నారు. ప్రజలకు హామీ ఇస్తున్నా..పీలేరు, మదనపల్లి, పుంగనూరును కలిపి ఆరునెలల్లోనే జిల్లా చేస్తానని, మదనపల్లి జిల్లా కేంద్రంగా ఉంటుందన్నారు. మదనపల్లిలో పెండింగులో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పూర్తి చేస్తామని, హంద్రీనీవా కాలువలోని 59వ ప్యాకేజ్, చిప్పిలి, గుంటువారిపల్లి ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణాలకు రూ.180 కోట్లు మంజూరు చేశామన్నారు. మీరు చూపిన ప్రేమ, ఆదరణ, గౌరవం మర్చిపోలేను. మదనపల్లిలో అడుగుపెట్టినప్పటినుండి నాకు ఘన స్వాగతం పలికి ఆశీర్వదించారు. మదనపల్లికి పరిశ్రమలు రాకపోవడానికి కారణం పెద్దిరెడ్డి కుటుంబమేని, వాళ్ల కుటుంబాన్ని తరిమికొట్టండన్నారు. మదనపల్లిలో వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని తెలిపారు. పోరాటాలకు పుట్టినిల్లు మదనపల్లి అని స్వాతంత్ర్యం కోసం గాంధీ మదనపల్లి వచ్చినప్పుడు పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చారని, 500 కి.మీ మైలు రాయిని దాటింది ఈ మదనపల్లెలోనే అది నా అదష్టమని పేర్కొన్నారు.

టిడిపిలో చేరిన మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా

కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే షాజహాన్ బాషా నారా లోకేష్ సమక్షంలో టిడిపిపార్టీలో చేరారు. లోకేష్ ఆయనకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. దొమ్మలపాటి రమేష్, షాజహాన్ బాషా ఇద్దరూ సమన్వయంతో మదనపల్లిని టిడిపికి కంచుకోటగా మార్చాలని ఆకాంక్షించారు.

మదనపల్లె మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాను టిడిపిలోకి ఆహ్వానిస్తున్న లోకేష్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

'ప్రశాంత ఎన్నికలకు పార్టీలు సహకరించాలి'

ప్రజాశక్తి-రాయచోటి

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ గిరీష కోరారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13 న ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని, రాజకీయ పార్టీ ఏజెంట్లకు ఒరిజినల్ ఫోటో గుర్తింపు కార్డు తప్పనిసరని తెలిపారు. పోలింగ్ కేంద్రంలోకి అనుమతించేందుకు పోలింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డులు కలిగి ఉండాలని సూచించారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ నిర్వహిస్తారని చెప్పారు. ఎన్నికల ప్రక్రియలో పార్టీలు సంయమనం పాటించాలని, ఎన్నికల సంఘం సూచనలను పాటించాలని కోరారు. పోలింగ్ ప్రక్రియలో ఏవైనా సమస్యలుంటే స్థానిక తహశీల్దార్‌కు తెలియజేయాలన్నారు. ఎన్నికల కోసం భారత ఎన్నికల సంఘం పంపిన జంబో బ్యాలెట్ బాక్సుల గురించి పార్టీలకు ఆయన అవగాహన కల్పించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన రాజకీయ నేతలు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాలలో రాణించాలి

ప్రజాశక్తి-రాయచోటి

మహిళలు అన్ని రంగాలలో రాణించి ముందుకు వెళ్లాలని కలెక్టర్ గిరీష పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా సమాఖ్య వారి అద్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు నిర్వహించి ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఆటల పోటీలలో గెలుపొందిన మహిళలకు కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రానించి ముందుకు వెళ్లాలన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు ప్రతి రంగంలో ముందున్నారని జిల్లా ప్రతి మహిళా విద్యావంతురాలై ఆర్థికంగా అభివ ృద్ధి చేయాలన్నారు. జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయ మాట్లాడుతూ సమాజంలో మహిళలందరూ పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఈ పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాలలో రాణించడం ప్రతి ఒక్కరు గర్వించదగ్గ విషయమన్నారు. మహిళలు ఏ సమస్య వచ్చినా భయపడకుండా ధైర్యంగా ఎదుర్కొని ముందుకు వెళ్లాలన్నారు. డిఆర్‌డిఎ జిల్లా సమాఖ్య అధ్వర్యంలో సమాఖ్య సభ్యులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించడం జరిగినది. అనంతరం స్పందన హాల్లో సమావేశం ఏర్పాటు చేసి డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ మహిళా దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా మహిళా అధికారులను ఘనంగా సత్కరించి ఆటల పోటీలలో పాల్గొన్న వారికి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు మైథిలి, జిల్లా నలుమూలల నుండి డిఆర్‌డిఎ మహిళా సిబ్బంది, మండల సమాఖ్యల లీడర్లు పాల్గొన్నారు.

మహిళలకు ప్రశంసా పత్రాలు ఇస్తున్న కలెక్టర్ గిరీష

సమావేశంలో మాట్లాడుతున్న పోతుల నాగరాజు

ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగులకు మోసం

- గెలుపు కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తున్న వైసిపి
- పట్టని ఎన్నికల కమిషన్
- పిడిఎఫ్ అభ్యర్థుల విజయం తథ్యం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు

ప్రజాశక్తి- కడప అర్బన్

అందరి సహకారంతో పిడిఎఫ్ ఎమ్మెల్సీల విజయం తథ్యమని ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం యుటిఎఫ్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతు తెలుపుతున్న విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల, ప్రతిపక్ష పార్టీల నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పిడిఎఫ్ అభ్యర్థులు గెలవబోతున్నారన్న విషయాన్ని పట్టభద్రులు గుర్తించాలని కోరారు. అధికార పార్టీ చేతులెత్తేసి, అక్రమాలకు తెరలేపిందని విమర్శించారు. జగన్ ఘనకార్యాల వల్ల ఆ పార్టీ నాయకులు ఓటర్ల నుంచి తిరస్కరణకు గురవుతున్నారని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి గెలిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగం మీద ప్రమాణం చేసిన మంత్రులు వైసిపికి తొత్తులుగా వ్యవహరిస్తూ ఉపాధ్యాయులను, పట్టభద్రుల ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల బూత్‌లకు మంత్రులు ఇన్‌ఛార్జులుగా వ్యవహరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సినిమా హాల్ వద్ద బ్లాక్ టికెట్స్ అమ్ముతున్నట్లు మంత్రులు వ్యవహరిస్తున్నారని విమ ర్శించారు. సిఎం జగన్‌కు దమ్ముంటే సిపిఎస్ రద్దు చేయాలని, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని, పిఎఫ్ నిధులు ఉద్యోగులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అధికారం అడ్డుపెట్టుకొని అక్రమాలకు పాల్పడుతున్న వైసిపి నాయకుల పట్ల ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వ వాహనాల్లో తిరుగుతూ మంత్రులు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మేధావులు, విద్యావంతులు, పట్టభద్రులు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కార్మికులు ఆలోచించాలని కోరారు. జాబ్ క్యాలెండర్, డీఎస్సీ విడుదల చేయకుండా నిరుద్యోగుల జీవితాలతో చెలగానమాడుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలపై రూ. 10 లక్షల కోట్ల అప్పు ఉందని తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఒత్తిడికి గురై ఆత్మహత్యల వైపుకు మరలడం బాధాకరమన్నారు. మీడియా గొంతు నొక్కేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అభ్యర్థులను ఓడించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, యాదవ సంఘం నాయకులు శివ యాదవ్ పాల్గొన్నారు.

అన్నమాచార్యలో సాంకేతిక సదస్సు

రాజంపేట అర్బన్ : అన్నమాచార్య ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం సాంకేతిక సదస్సు ఆన్‌లైన్ విధానం ద్వారా నిర్వహించామని ఇఇఇ విభాగాధిపతి, కన్వీనర్ ఎం.పద్మ లలిత తెలిపారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎలక్ట్రికల్ సైన్సస్ (ఎన్‌సిఇఎస్-2023) అను పేరిట ఇఇఇ విభాగంలో నిర్వహించిన ఈ సాంకేతిక సదస్సుకు డాక్టర్ ఒ.చంద్రశేఖర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఇఇఇ విభాగం, ఎన్ఐటి డిల్లీ వారు ముఖ్య అతిథిగా వ్యవహరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ సదస్సులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు సంబంధించిన విద్యార్థులు, అధ్యాపకులు, పరిశోధకులు వారి పరిశోధనా పత్రాలను సమర్పించామని తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు నూతన ఆవిష్కరణలకు దోహదపడతాయని తెలియజేశారు. కార్యక్రమానికి డాక్టర్ ఒ.హేమకేశవులు, డాక్టర్ పి.గోపిలు కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. కార్యక్రమానికి సహకరించిన కళాశాల ప్రిన్సిపల్, యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు.

ఎత్తులు..పైఎత్తులు!

ఏజెంట్ల కోసం అన్వేషణ
పోలరైజేషన్ కసరత్తుల్లో అభ్యర్థులు

జిల్లాలో పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల వ్యవహారం క్లైమాక్స్‌కు చేరుకుంది. శనివారం సాయంత్రంతో ప్రచారానికి తెరపడనున్న నేపథ్యంలో నెల రోజులుగా ఎన్నికల ప్రచారం రసవత్తరంగా సాగింది. ఈ నెల 13న పోలింగ్ సమయం నాటికి కీలకమైన పోలింగ్ బూత్ ఏజెంట్ల నియామకం దగ్గర నుంచి ఓటింగ్ పోలరైజేషన్‌కు అనుగుణమైన వ్యూహాల అమలు, బూత్‌ల వారీగా నమ్మకమైన అనుచరులను ఏజెంట్లుగా నియామకం, ప్రచారం ముగిసిన వెంటనే ఓటర్లను పోలరైజేషన్ చేయడానికి అవసరమైన ఎత్తులు ..పైఎత్తుల ఎత్తుగడల అమలులో నిమగ్నమైనట్లు కనిపిస్తోంది. జిల్లా స్థాయి పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన బందోబస్తులు, నిర్వహణాపరమైన చర్యలు తీసుకుంటుండడం గమనార్హం.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పశ్చిమ రాయలసీమ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థులు వ్యూహాత్మక ఎత్తుగడలకు తెరలేచింది. ఈ నెల తొమ్మిదిన పట్టభద్ర, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ నగరా మోగించిన సంగతి తెలిసిందే. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాజీ మంత్రి పి.రామసుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నిక కావడం తెలిసిందే. మిగిలిన రెండు ఎమ్మెల్సీ పదవులకు నిర్వహించిన ఎన్నికల్లో 39 పట్టభద్ర, 12 మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఎన్నికల బరిలో దిగిన సంగతి తెలిసిందే. ఉమ్మడి, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల్లో నెల రోజులుగా ఎన్నికల కోలా హలం నెలకొంది. 2,09,800 మంది పట్టభద్ర ఓటర్లు, 1,41,400 మంది ఉపాధ్యాయ ఓటర్లను ఆకట్టుకోవడానికి ప్రచారాన్ని హోరెత్తించారు. జిల్లాలో 131 పోలింగ్‌బూత్‌లు ఉన్నాయి. పోలింగ్ బూత్‌ల్లో ఏజెంట్లుగా నమ్మకమైన అనుచరుల నియామకం దగ్గర నుంచి ఓటింగ్ పోలరైజేషన్‌పై దృష్టి సారించడం, గెలుపునకు అవసరమైన మెజార్టీని సాధించుకోవడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఎన్నికల ప్రచారం ముగిసిన అనంతర సైలెంట్ పీరియడ్‌లో అనుసరించాల్సిన ఎత్తుగడల్లో మునిగిపోయారు. ఎన్నికల్లో వైసిపి మద్దతుదారు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం దగ్గర నుంచి ఏజెంట్ల మేనేజ్ చేయడం, సైక్లింగ్ చేయడం వంటి అరాచకాలను ఎదుర్కోవడంపై అభ్యర్థులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పోలింగ్‌ను పకడ్బందీగా నిర్వహించడంపై జిల్లా అధికార యంత్రాంగం కసరత్తు చేసింది. ఎలాంటి పొరపాట్లు దొర్లకుండా పోలింగ్ నిర్వహించడంపై జాయింట్ కలెక్టర్ పర్యవేక్షణలో సీనియర్ అధికారులు వరుస సమావేశాల నిర్వహించారు. పోలింగ్ నిర్వహణ విధానం పట్ల స్పష్టత సాధించినట్లు తెలుస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్.జగన్ సొంత జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో ఎలాంటి అక్రమాలకు అవకాశం లేకుండా చేయడంపై జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించింది. ఇందుకుఅనుగుణంగా బందోబస్తు ఏర్పాట్లలో నిమగ్నం కావడం గమనార్హం.

పారదర్శకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహించాలి : కలెక్టర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ గిరీష సెక్టోరల్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎటువంటి చిన్న సమస్య తలెత్తకుండా పారదర్శకంగా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు పోలింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. ఈ ఎన్నికలలో రీపోలింగ్‌కి అవకాశం లేకుండా జాగ్రత్తగా పోలింగ్ సరళి జరిగేటట్టు చూడాలన్నారు. సెక్టోరల్ అధికారులు కీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. సెక్టోరియల్ అధికారులకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, వీల్ చైర్స్, విద్యుత్, తాగునీరు, వెబ్ క్యాసిటింగ్ చేయుటకు అవసరమైన విద్యుత్ సౌకర్యాలు ఉండేటట్లు చూడాలన్నారు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్లు వరకు మార్కింగ్ చేయాలని,పోలింగ్ కేంద్రం లోనికి సెల్ ఫోన్స్, టీ, కాఫీ, వాటర్ బాటల్స్, పెన్‌లు, అగ్గి పెట్టలు తీసికెళ్లా రాదన్నారు. పిఒ ఇచ్చిన పెన్‌తోనే ఓటరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్స్ ఓటరుకు ఇచ్చేటప్పుడు జాగ్రత్తగా ఇవ్వాలని, ఓటర్ ఓటు వేసిన బ్యాలెట్ పేపర్‌ను బ్యాలెట్ బాక్స్‌లో వెచేలా సెక్టోరియల్ అధికారులు పరిశీలించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో వెబ్ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహింస్తామని తెలిపారు. ప్రతి రెండు గంటలకు పోలింగ్ శాతం వివరాలను ఉన్నతాధికారులకు పంపాలన్నారు. పోలింగ్ కేంద్రం పరిసర ప్రాంతాలలో ఎటువంటి గొడవలు జరగకుండా పోలీస్ బందోబస్తుతో సమ న్వయం చేసుకొని తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 13న సాయంత్రం పోలింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత పిఒ, డైరీ, బ్యాలెట్ పేపర్స్ అకౌంట్ అన్ని సక్రమంగా ఉన్నాయా లేదా పరిశీలించి మీకు కేటాయించిన రిసెప్షన్ కేంద్రంలో అందజేయాలని సెక్టోరియాల్ అధికారులను ఆదేశించారు. పిఒలు, ఎపిఒలకు సంబంధించిన ఫోన్ నెంబర్లను సెక్టోరియల్ అధికారుల వద్ద ఉంచుకోవాలన్నారు. పోలింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల ప్రవర్తనా నియమావళి పక్కాగా అమలు చేయాలని తెలిపారు. ఎన్నికలలో ఓటు వేసే ఓటర్లు ఓటర్ స్లిప్‌తో పాటు ఏదో ఒక ఫోటో గుర్తింపు కార్డు తప్పకుండా ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్లో ఎటువంటి సమస్య వచ్చినా సెక్టోరల్ అధికారులకు, తహశీల్దార్లకు ఫోన్ చేయడం జరుగుతుందని వీరు లా అండ్ ఆర్డర్ పక్కాగా పాటించాలన్నారు. ఎక్కడైనా చిన్న చిన్న సమస్యలు తలెత్తినట్లయితే ప్రిసైడింగ్ అధికారులు బ్యాలెట్ బాక్స్, బ్యాలెట్ పేపర్‌లు జాగ్రత్తగా సేవ్ చేసుకోవాలన్నారు. బ్యాలెట్ పేపర్ అకౌంట్ ప్రతి ఏజెంట్ దగ్గర ఉండేటట్లు చూడాలన్నారు. ఎలక్ట్రోరల్ అధికారులు ఈ ఎన్నికలలో ఓవరాల్ గా ఎలక్షన్ రిలేటెడ్ యాక్టివిటీస్ అన్ని చూసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ ముందు ఆ పోలింగ్ బూత్ లో ఎన్ని ఓట్లు ఉన్నాయి సీరియల్ నెంబర్ల వారీగా ఓటర్ల వివరాలు బయట అతికించాలన్నారు. ఈ ఎన్నికలను ప్రతి ఒక్కరు సీరియస్గా తీసుకొని రీ పోలింగ్‌కు అవకాశం లేకుండా పోలింగ్ సరళి విజయవంతం చేసి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారీయా, రాజంపేట సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, రాయచోటి ఆర్డీవో రంగస్వామి, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి-రాయచోటి టౌన్

పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్‌పి హర్షవర్ధన్ రాజు అన్నారు. శుక్రవారం జిల్లాలోని పలు పోలింగ్ బూత్‌లను సందర్శించి భద్రత ఏర్పాట్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా జరిగే విధంగా పటిష్టమైన భద్రతా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశాలు జారీ చేశారు. సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి అలాంటి కేంద్రాలలో అదనపు బలగాలను నియమించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పోలింగ్ జరిగే రోజు పోలింగ్ కేంద్రాల వద్ద ఏదైనా సమస్యలు జరిగితే ప్రిసైడింగ్ అధికారికి తెలియపరచి సమస్యను పరిష్కరించాలన్నారు. బ్యాలెట్ బాక్స్‌లను 12వ తేదీన పటిష్టమైన బందోబస్తు నడుమ కేంద్రాలకు పంపుతామని తెలిపారు. ప్రతి మండల పరిధికి ఒక మొబైల్ పార్టీని నియమిస్తూ ఎస్ఐ స్థాయి అధికారి ఇన్‌ఛార్జిగా నియమిస్తామని చెప్పారు. పోలింగ్ నియమావళి ప్రకారం పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ వరకు ప్రజలు ఎవరు గుంపులుగా ఉండకుండా చూడాలని అధికారులు వారి సిబ్బందికి ఎన్నికలకు సంబంధించిన తగు సూచనలు ఇవ్వాలని ఆదేశించారు. ఏ రాజకీయ పార్టీ వారు కూడా ఓటర్లను తమ సొంత వాహనాలలో పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకొని రాకూడదని ఇలాంటివి ఘటనలు జరిగితే ఆ వాహనాన్ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరంచారు. ఓటింగ్ స్లిప్‌లను పోలింగ్ కేంద్రాల వద్ద పంచకూడదని పోలింగ్ నేపథ్యంలో అక్రమ మద్యం రవాణా చేసే అవకాశాలు ఉన్నందున మరింత చెక్ పోస్టులను పెంచి వాహన తనిఖీలు మరింత కఠినంగా చేయాలని తెలిపారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్ చేరేవరకు పోలీస్ సిబ్బంది పోలింగ్ కేంద్రాల వద్ద ఉండాలని పోలింగ్ రోజు ప్రిసైడింగ్ ఆఫీసర్ మినహా ఎవరు పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించ కూడదని పోలింగ్ నిర్వహించే అధికారులతో సహా ఎవరు పోలింగ్ కేంద్రాలలోకి ఇంకు లేదా నీరు లాంటి ద్రవపదార్థాలను మొబైల్ ఫోన్స్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను లోపలికి అనుమతించకూడదని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ముందస్తు సంబరాలు జరుపుకోకూడదని తెలిపారు. అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురి చేయకూడదన్నారు. అలా చేస్తే నేరంగా పరిగణించబడుతుందని దీనిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు. ప్రలోభాలకు గురి చేస్తే ఎలక్షన్ కమిషన్‌కు గాని లేదా డయల్ 100కు దగ్గర్లోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇస్తే తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మండలి ఎన్నికల్లో వైసిపి బరితెగింపు : 'బత్యాల'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శాసనమండలి ఎన్నికలలో వైసిపి ప్రభుత్వం బరితెగింపుకు దిగి అరాచకాలను సృష్టిస్తోందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చెంగల్రాయుడు అన్నారు. శుక్రవారం టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు మేలు చేయని మండలి అవసరం లేదని, మండలిపై రూపాయి ఖర్చు కూడా దండగేనని వ్యాఖ్యలు చేసిన జగన్ నేడు అదే ఎన్నికలలో నకిలీ ఓట్లు, దాడులతో అరాచకం సృష్టిస్తున్నారని విమర్శించారు. జగన్ మాయాజాలంతో కళాశాల మెట్లెక్కని వారంతా పట్టభద్రులయ్యారన్నారు. తిరుపతిలో భారీగా బోగస్ ఓట్లు నమోదయ్యాయన్నారు. చిత్తూరు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి ధనుంజయ యాదవ్‌ను కిడ్నాప్ చేసేందుకు వైసిపి శ్రేణులు తెగబడ్డారని తెలిపారు. ఆర్‌జెడి ప్రతాప్‌రెడ్డి అధికార పార్టీ అభ్యర్థి తరపున బహిరంగంగా పాఠశాలల్లో ప్రచారం చేస్తున్నా ప్రభుత్వం వారిని పట్టించుకోకుండా ప్రత్యర్థ్య అభ్యర్థులను, వారి వెంట నడిచే ఉపాధ్యాయులకు షోకాజు నోటీసులు పంపి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని పేర్కొన్నారు. అధికారం చేతిలో ఉంటే ఎన్నికలు జరగకుండానే పదవులు ఎలా సొంతం చేసుకోవాలో వైసిపికి తెలిసినంతగా ఎవరికి తెలియదన్నారు. నిరుద్యోగులు జగన్ ప్రభుత్వం పైన వ్యతిరేకత ఉన్నదని తెలుసుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ రోజునే పోలీసు నియామకాలకు సంబంధించి అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షుడు గన్నె సుబ్బ నరసయ్య నాయుడు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు అనసూయమ్మ, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు రేవూరి వేణుగోపాల్, మిరియాల జ్యోతి, జడ శివ, జ్యోతి శివ, రాంనగర్ నరసింహ పాల్గొన్నారు.

మాయమాటలు నమ్మొద్దు : ఆర్ఆర్

రాయచోటి : పట్టుభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో వైసిపి నాయకులు డబ్బులు పంపిణీ చేసి మాయమాటలు నమ్మొద్దని మాజీ ఎమ్మెల్యే ఆర్.రమేష్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలో నకిలీ సర్టిఫికెట్లతో అధిక దొంగ ఓట్లు నమోదు చేశారన్నారు. వైసిపి నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంపిణీ చేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపాలిటీ పరిధిలో వాలంటరీ, స్థానిక కౌన్సిలర్లతో డబ్బులు పంపిణీ కార్యక్రమం చేపడుతున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ దొంగ ఓట్లను పరిశీలించి అధికారులపై తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాజుల ఖాదరబాష, టిడిపి రూరల్ అధ్యక్షులు వెంకటసుబ్బారెడ్డి, వాసు పాల్గొన్నారు.

రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

పిఎండిఎస్ పద్ధతితో అధిక లాభాలు

ప్రజాశక్తి-రామాపురం

రైతులు ప్రీ మాన్సూన్ డ్రై సోయింగ్ పద్ధతి ద్వారా అధిక దిగుబడి, లాభాలను పొందవచ్చునని మండల వ్యవసాయ అధికారిని నాగమణి అన్నారు. మండలంలోని నల్లగుట్టపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం అడ్వైజరీ బోర్డు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా బోర్డు చైర్మన్ అయోధ్యపురం పెద్దిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన పలు రకాల విత్తనాలను 20 నుంచి 35 రకాల విత్తనవు కిట్లుగా తయారు చేసి రైతులందరికీ పంచి పెట్టడం జరుగుతుందన్నారు. రైతులు వాటిని వినియోగించుకుని భూమిలో వర్షం ద్వారా 365 రోజులు భూమి పచ్చదనం ఉండడమే కాక ఆదాయాన్ని ఇచ్చే పలు రకాల పంటలను పండించుకుని రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. భూమిలో కార్బన్, నత్రజని శాతం పెరిగి నేల సారవంతంగా తయారు చేసుకోవచ్చన్నారు. ఎఒ నాగమణి మాట్లాడుతూ రైతులకు అందరికీ అందుబాటులో ఉచితంగా విత్తనవు కిట్లు అందజేయడం జరుగుతుందని, వాటిని వినియోగించేయని రైతులు పిఎండిఎస్ ద్వారా అధిక లాభాన్ని పొందాలని రైతులను కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, మాస్టర్ ట్రైనర్ వెంకటరమణ, మధుకర్, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

చెరువుల వేలం పాట వాయిదా

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల పరిధిలోనివనటం గ్రామంలోని చేపల చెరువులకు నిర్వహించాల్సిన బహిరంగ వేలంను ఈనెల 14వ తేదీకి వాయిదా వేసినట్లు ఎంపిడిఒ లీలా మాధవి, సర్పంచ్ రెడ్డప్ప తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేపల ప్లసాయానికి తవటం గ్రామంలోని నాలుగు చెరువులకు వేలంపాటను శుక్రవారం నిర్వహించాల్సి ఉండగా, కొన్ని అనివార్య కారణాల వల్ల మంగళవారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. వేలంపాట వాయిదాను ప్రజలు గుర్తించి మంగళవారం నిర్వహించు వేలం పాటలో పాల్గొని చెరువులను దక్కించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

పాదయాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-ములకలచెరువు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్రను జయప్రదం చేయాలని మండల టిడిపి కన్వీనర్ పాలని సిద్ద కోరారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్ర శనివారం తంబళ్లపల్లె నియోజకవర్గంలో ప్రారంభమవుతుందని అన్నారు. నియోజకవర్గంలోని అంగళ్లు మీదుగా పాదయాత్ర ఉంటుందని, ఈ పాదయాత్రను విజయవంతం చేయాలని మండల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

స్వల్పకాలిక కోర్సులపై శిక్షణ

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన పథకంలో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ ఐటిఐ నందు స్వల్పకాలిక కోర్సుల ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ న్యూఢిల్లీ డైరెక్టర్ జనరల్, డైరెక్టర్ జనరల్ ఆఫ్ ట్రైనింగ్ వారి ఆదేశాల మేరకు టిఎన్‌విఎస్‌ఆర్‌ఎం ప్రభుత్వ ఐటిఐ తంబళ్లపల్లిలో నిర్వహించనున్నారు. ప్రధానమంత్రి కౌశల్ వికాస యోజన 4.0 పథకం కింద సెల్ఫ్ ఎంప్లాయిడ్ టేలర్, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ సర్వేయర్, ఫిట్టర్ ఫ్యాబ్రికేషన్ కోర్సుల్లో స్వల్పకాలిక శిక్షణ ఇవ్వనున్నారు. అభ్యర్థులు ఎనిమిదవ తరగతి లేదా పదవ మానేసిన, పదవ తరగతి, ఐటిఐలో ఉత్తీర్ణత పొందిన యువత వయోపరిమితి 15-45 సంవత్సరాల మధ్య ఉన్న వారి నందు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 25న సాయంత్రం 5 గంటలలోపు టిఎన్ విఎస్ఆర్ఎం ప్రభుత్వ ఐటిఐలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు కోసం ధ్రువపత్రాలు ఆధార్‌కార్డు జిరాక్స్, ఫోటోలు కూడా జతపరచాలన్నారు. మరింత సమాచారం కోసం 9494080339 నంబరును సంప్రదించాలని కోరారు.

అభాగ్యులకు అన్నదానం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

యంగ్ఇండియా సేవా సమితి సభ్యుడు మహేష్ తన కుమార్తె చంద్రిక పుట్టినరోజును సందర్భంగా శుక్రవారం బెంగళూరు పట్టణంలోని నందగోకులం ఆశ్రమంలో 50 మంది అనాధ పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా యంగ్ ఇండియా సేవా సమితి వ్యవస్థాపకులు రాజశేఖర్ మాట్లాడుతూ తమ సంస్థ సభ్యులు సమాజ సేవా కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుంటారని కొనియాడారు. వారు పుట్టినరోజు, వివాహ వేడుకలను నిరాడంబరంగా జరుపుకొని అనాధ ఆశ్రమాలు, వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు నిర్వహించడం శుభ పరిణామన్నారు. ఇదే స్ఫూర్తితో మాసంస్థ ద్వారా భవిష్యత్తులో మరిన్నీ సేవా కార్యక్రమాలకు చేపడతామని అన్నారు.

పోలీస్‌స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నపత్రాలు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని స్థానిక పోలీస్ స్టేషన్‌కు ఇంటర్ ప్రశ్నపత్రాలు చేరాయి. సంబంధిత అధికారులు పోలీసుల సమక్షంలో భద్రపరచడం జరిగింది. ఈనెల 15వ తేదీ నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలు జంబ్లింగ్ విధానంలో పుల్లంపేట విద్యార్థులు చిన్నవరంపాడుకి, చిన్న వరంపాడు విద్యార్థులు పుల్లంపేటలకు జంబ్లింగ్ విధానంలో పరీక్షలు రాయనున్నారు.

వృద్ధులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలోని బాసట సేవా సంస్థ సభ్యులలైన పవన్, అనీష్, వంశీధర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బాసట కీలక సభ్యులు డి.ఎ. కార్తీక్‌రెడ్డి శుక్రవారం నగర శివారులోని చౌడమ్మ, బృందా వృద్ధాశ్రమాల్లో చీరలు పంపిణీ, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిత్రుల పుట్టిన రోజున ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. అభాగ్యులను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ తమ తోచిన సాయం అందివ్వాలని కోరారు. అభాగ్యులను అండగా వారిలో మనోధైర్యం నింపుతామని అన్నారు. కార్యక్రమంలో శ్రీను, బాసట ఫుడ్ టీమ్ చంద్రమౌళి రెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి

ప్రజాశక్తి-పీలేరు

సావిత్రిబాయి పూలే ఆడవారి అక్షరాభివృద్ధి కోసం కృషిచేసి భారతదేశ చరిత్రలో ఓ ధ్రువ తారగా నిలిచారని మాలమహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల ధరణ్ కుమార్, భారతీయ అంబేద్కర్ సేనా జిల్లా కార్యదర్శి పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో తిరుపతి రోడ్డులోని బాలికల గురుకుల పాఠశాలలో చదువుల తల్లి సావిత్రీ బాయి పూలే 126వ వర్ధంతి సందర్భంగా సావిత్రీ బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతదేశంలోని ప్రముఖ సంఘ సంస్కర్తల్లో భారత మాత సావిత్రీబాయి పూలే ఒకరని చెప్పారు. బ్రిటిష్ పాలనలో నాటి ప్రజల స్థితిగతులు, విద్య, సాంఘిక దురాచారాలు, సతీ సహగమనం, బాల్య వివాహాలు వంటి సంఘటనలు సావిత్రీబాయి హృదయాన్ని కలచివేశాయని అన్నారు. మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చెందిన నయ్‌గావ్‌లో 1831వ సంవత్సరం జనవరి 3వ తేదీన సావిత్రీబాయి జన్మించిందని, ఈమెది కూడా బాల్య వివాహమేనని, ఆమె వివాహం సంఘసంస్కర్త మహాత్మా చదువుల తండ్రి, భారత పిత, జ్యోతిరావు పూలెతో జరిగిందని గుర్తు చేశారు. వివాహానంతరం ఆమెకు మహాత్మ జ్యోతిరావు పూలే విద్యాభ్యాసం చేసి ఉపాధ్యాయ శిక్షణ ఇప్పించారని గుర్తు చేశారు. కుల వ్యవస్థ నిర్మూలనకు, పీడిత ప్రజానీకం పట్ల ఆమె మనసులో ఆలోచనలను గుర్తించిన జ్యోతిరావు పూలే బాలికల పాఠశాల ప్రారంభించడానికి ప్రయత్నం చేశారని తెలిపారు. 1897వ సంవత్సరం మార్చి 10న ఆమెకు ప్లేగు వ్యాధి సోకి మృతి చెంది క్రాంతి బాయిగా ప్రజలందరూ పిలుచుకునే భారత మాత, చదువుల తల్లి సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధృవతారగా వెలుగొందుతూనే ఉంటుందని అన్నారు.కార్యక్రమంలో మాలమహానాడు రాయలసీమ జిల్లాల కార్యదర్శి నగరిమడుగు సుబాష్, జిల్లా ఉపాధ్యక్షులు జెట్టి మల్లికార్జున, బాస్ పీలేరు నియోజకవర్గ అధ్యక్షులు ఎర్రబల్లి మల్లికార్జున, మాలమహానాడు నాయకులు పాటూరి ప్రసాద్, విజయ్ కుమార్, గురుకుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు యస్. మహబూబ్ బాష, మహిళా ఉపాధ్యాయ బృందం సునీత, రేవతి, కళ్యాణి, సుభాషిణి, ప్రజాసంఘాల నాయకులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.

సావిత్రిబాయి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

బి.కొత్తకోట : పట్టణంలోని ఉర్దూ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సావిత్రిబాయి పూలే 126వ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఇఒ రెడ్డిశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ చరిత్రలోనే సామాజిక విప్లవకారుడిగా ఘనతకెక్కిన జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే కులమతాల పేరుతో తరతరాలుగా అణచివేతకు గురైన నిమ్నజాతి ప్రజలకు ఆత్మస్థైర్యం కల్పించిన మహోన్నత వ్యక్తని కొనియాడారు. అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీలు చదువుకొనేందుకు ఆమె పాఠశాలలు సైతం ప్రారంభించి తొలి ఉపాధ్యాయురాలిగా ఘనత సాధించారని అన్నారు. భారతీయ అంబేద్కర్ సేన నాయకులు మాట్లాడుతూ దళిత, ఆదివాసీ, గిరిజన, మైనార్టీ కులాల మహిళల ఐక్యతకోసం పాటుపడిన సావిత్రిబాయి తన పాఠశాలల్లో అన్ని మతాలకూ చోటు కల్పించారని తెలిపారు. ఆమె పాఠశాల ద్వారానే ఫాతిమాషేక్ అనే యువతి తొలి ముస్లిం మహిళా అధ్యాపకురాలుగా చరిత్రకెక్కడం గమనార్హమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెంగల్రాయులు, ఉపాధ్యాయులు బషీర్, నూర్జహాన్, ఫరీదాలు సచిన్, మాధవ, మణి, గంగాద్రి, వెంకటేష్, రెడ్డి, నవీన్, మహేష్, పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం అందరి బాధ్యత : ఎంపిడిఒ

నులిపురుగు మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ జులేఖ బేగం, ఎంపిడిఒ

ప్రజాశక్తి-కలకడ

చిన్నారుల ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ సిహెచ్ నారాయణ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన కలకడ మండల పరిషత్ కార్యాలయంలో వైద్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 14 వ తేదీన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలు 6772 మంది ఉన్నారన్నారు. వీరందరికీ 14న అల్బెండజోల్ 400మీ.గ్రా మాత్రలు తప్పకుండా మింగించాలన్నారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం, రక్తహీనత లేని సమాజ స్థాపనకు ప్రతీ సంవత్సరం రెండు దఫాలుగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాల పిల్లల ఆరోగ్యం కోసం నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం కార్యక్రమంలో అందరూ భాగ్యస్వాములై విజయవంతం చేయాలని పేర్కొన్నారు. 1-2 సంవత్సరాల వయస్సు పిల్లలందరికీ అర్ధ మాత్రను, రెండు సంవత్సరాముల పైబడి 19 సంవత్సరాలు వయస్సు లోపు పిల్లలందరికీ ఒక మాత్రను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రము లో ఎంఇఒ యం.మునీంద్రనాయక్, వైద్యధికారులు డాక్టర్ యంవి.కిషోర్ కుమార్‌రెడ్డి, డాక్టర్ సి.మల్లికార్జున, జయరామయ్య. వెంకటేశు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. **నిమ్మనపల్లి :** మండలంలోని పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖబేగం తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ లీలామాధవి ఆధ్వర్యంలో ప్రయివేట్ పాఠశాల లైన కేశవరెడ్డి, విజయవాణి పాఠశాలలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల14న జాతీయ నూలి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ, ప్రయివేట్, అంగన్వాడీ పాఠశాలలకు ముందస్తుగా నులి పురుగుల నివారణ మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో సిహెచ్ఒ మల్లిక, పిహెచ్ఎన్ సరోజ, ప్రయివేట్ పాఠశాలల సిబ్బంది పాల్గొన్నారు. **కలికిరి :** జాతీయ నులిపురుగు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపిడిఒ గంగయ్య తెలిపారు. ఈనెల 14న జాతీయ నులి పురుగుల దినోత్సవం సందర్భంగా స్థానిక మండల అభివృద్ధి కార్యాలయంలో ఎంపిడిఒ గంగయ్య ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు, ఎఎన్ఎంలు, ఆశ వర్కర్లకు నులిపురుగు దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** ఈనెల 14న నులిపురుగుల దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని అన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డాక్టర్ మనోజ్ చంద్ర ఆధ్వర్యంలో నులిపురుగుల మందులు ముందస్తుగా పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో ఒకటి నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు మందలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశం, ఎంఇఒ రంగనాథయ్య, జిల్లా పరిషత్, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం డాక్టర్ మనికుమార్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలుఫర్, ఎంపిడిఒ ఆనంద్‌కుమార్, ఎంఇఒ త్యాగరాజు, ఎంపి హెచ్ఒ రమణ పాల్గొన్నారు.

యాజమాన్యం కృషి అభినందనీయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-కడప అర్బన్

నాగార్జున మోడల్ స్కూల్ యాజమాన్యం కృషి అభినందనీయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం నాగార్జున మోడల్ స్కూల్ రామరాజు పల్లె బ్రాంచ్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని విద్యాసంస్థలలో కెల్లా నాగార్జున మోడల్ స్కూల్ కు ప్రత్యేక గుర్తింపు ఉందని చెప్పారు. ఎంతోమంది డాక్టర్లు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలను సమాజానికి అందజేసిందని కొనియాడారు. ఉత్తమ విద్యను అందజేయడం వల్లే రెండవ బ్రాంచ్ ప్రారంభించారని చెప్పారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల విద్యా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వైవీయూ ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి శాస్త్రవేత్తలు కావాలని పిలుపునిచ్చారు. దేశానికి శాస్త్రవేత్తల అవసరం ఉందని పేర్కొన్నారు. స్కూలు విద్యాసంస్థల చైర్మన్ ఎం. శివ శంకర్ రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా వికాసంతో పాటు సమాజ వికాసానికి అవసరమైన వసతులు కల్పిస్తూ ఎప్పటికప్పుడు అత్యాధునిక బోధనా పద్ధతులను అవలంబిస్తున్నామని తెలిపారు. పోటీ ప్రపంచంలో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఫ్రీ ప్రైమరీ స్కూల్ కిండర్ గార్డెన్ పూర్తి చేసుకున్న చిన్నారులకు కాన్వకేషన్ పట్టాలు అందజేశారు. వివిధ పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో వైవీయూ ప్రొఫెసర్ పుత్త పద్మ, స్కూలు డీన్ కులాయప్ప, ప్రిన్సిపల్ కృష్ణవేణి, వీర శివ, బోధన బోధన సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

విజయవాడపై నెల్లూరు జట్టు విజయం

కడప: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ రాజారెడ్డి ఎసిఎస్ స్టేడియంలో పి ధనుంజయ్ రెడ్డి మెమోరియల్ వెటరన్స్ టి-20 క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం ఉదయం నిర్వహించిన మ్యాచ్‌లో విజయవాడ జట్టుపై నెల్లూరు ఒక పరుగు తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన విజయవాడ ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 104 పరుగులు చేసింది. ఆ జట్టులోని రాజా కృష్ణ 60 పరుగులు చేశాడు. విజయవాడ జట్టులోని సిహెచ్ శ్రీకాంత్ మూడు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 145 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ కుదిగిన విజయవాడ జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 143 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని సంజయ్ 42 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని ఉమా మహేష్ మూడు వికెట్లు తీసుకున్నాడు.

గోవాపై హైదరాబాద్ జట్టు...

మధ్యాహ్నం నిర్వహించిన వేరొక మ్యాచ్‌లో గోవా జట్టుపై 35 పరుగుల తేడాతో హైదరాబాద్ జట్టు ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన గోవా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ తట్టు 20 ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. చంద్రశేఖర్ 71 పరుగులు చేశారు. గోవా జట్టులోని అమూల్ సుభాష్ బోజానే రెండు వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 170 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్కు దిగిన గోవా జట్టు 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 134 పరుగులు చేసి ఓటమి చెందింది. ఆ జట్టులోని సోనాల్సిందే 34 పరుగులు చేశాడు. హైదరాబాద్ జట్టులోని మల్లికార్జున వర్మ, వినోద్, కృష్ణ కాంత్ రెడ్డి రెండేసి వికెట్లు తీసుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రధానోపాధ్యాయులు నిర్మల

ఉజ్వల భవిష్యత్తు కోసం పాటుపడాలి

ప్రజాశక్తి-గాలివీడు

ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు ఉజ్వల భవిష్యత్తు కోసం పాటు పడాలని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఒ.నిర్మల పేర్కొన్నారు. శుక్రవారం ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇంటర్మీడియట్ మధ్యస్థ దశకు విద్యార్థులు చేరుకున్నారని, ఉన్నత లక్ష్యాలకు చేరుకునేందుకు ఇదే మంచి అవకాశమని అన్నారు. యువత పెడదారిని పట్టకుండా మంచి అలవాటులతో ముందు సాగాలని పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.రెడ్డెన్న మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు మేలైన మార్గాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ జయ చంద్రారెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రఓబుల్ రెడ్డి, అయ్యప్ప, రామసుబ్బారెడ్డి, శివ ప్రసాద్, జనార్ధన్, గంగిరెడ్డి లెక్చరర్లు వెంకటప్ప, మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ నరసింహారెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తునికి వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

కుష్టు వ్యాధిగ్రస్తులకు వైద్య సేవలు

ప్రజాశక్తి-కలకడ

విభిన్న ప్రతిభావంతులకు సేవలందించినట్లు ఎర్రకోటపల్లి వైద్యాధికారి జవహర్ బాబు తెలిపారు. శుక్రవారం మండలంలోని ఎర్రకోటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధి గ్రస్తులు, అంగవైకల్యం ఉన్నవారికి పిహెచ్‌సిలో చికిత్స సదుపాయాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. కాళ్ళు చేతులు ఒక బకెట్లో పెట్టి బాగా నానిన తర్వాత గరుకురాయితో శుభ్రం చేయుట వలన వారి చర్మం మృదువుగా ఏర్పడుతుందన్నారు. అలాగే ఆయిలింగ్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. ఇలా రోజు మార్చి రోజు చేసుకోవడం గాయాలు కాకుండా ఉంటాయని అన్నారు. వారికి కావలసిన బ్యాండేజీ క్లాత్, మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపి హెచ్ఇఒ జి.జయరామయ్య, పిహెచ్ఎన్ సుబ్బరత్న, సూపర్వైజర్లు. ముజీబ్‌బాషా, స్టాఫ్ నర్స్ భారతమ్మ, ఆరోగ్య కార్యకర్త వాణి, ఆశాకార్యకర్త, గురుశాంత, ఎఫ్ఎన్ఒ అలివేలు మంగబాయి పాల్గొన్నారు.

మురుగు నీటి కాలువలను పరిశీలిస్తున్న జిల్లా వైద్య శాఖ అధికారులు

పరిసరాల శుభ్రతపై శ్రద్ధ వహించాలి

ప్రజాశక్తి- కలకడ

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కొండయ్య, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండలంలోని కలకడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఎర్రయ్యగారిపల్లి విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడేగా పరిగణించి లార్వా నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో ఇంటింటికి తిరిగి జ్వరాలతో బాధపడుతున్న వారిని గుర్తించి వారికి మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని, వ్యక్తిగత పారిశుధ్యాన్ని పాటించేలా గ్రామీణ ప్రజలకు సూచనలు, సలహాలు అందించాలని కొనియాడారు. ఈనెల 14న నిర్వహించిన జాతీయ డి వార్మింగ్ డేని విజయవంతం చేసేందుకు సిబ్బంది కలిసికట్టుగా పని చేయాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మల్లికార్జున, ఎంపిహెచ్ఒ వెంకటేశు, హెల్త్ సూపర్వైజర్ వెంకటేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి నందిని ,వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

డిపో ఎదుట నిరసన తెలుపుతున్న యూనియన్ నాయకులు

డిమాండ్లను నెరవేర్చాలి : ఎయు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బిసి శేఖర్ డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల పైన శుక్రవారం ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో డిపో ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు, కండక్టర్లకు డ్యూటీ చార్ట్ వెంటనే వేయాలని, డ్రైవర్లకు గత రెండు నెలలుగా సెలవు మంజూరు చేయక పోవడంతో సిక్ లీవ్ చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా డబుల్ డ్యూటీ చేసిన సిబ్బందికి వెంటనే వేతనం మంజూరు చేయాలని, చిట్వేలి కోడూరు తిరుపతి సెక్టార్లలో బస్సు సర్వీసులు పెంచాలని తెలిపారు. మిగిలిపోయిన కండక్టర్లను బలవంతంగా సెలవులు వేసే విధానాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ఎం.నరసారెడ్డి, సహాయ కార్యదర్శి మల్లిఖార్జున, వర్కింగ్ ప్రెసిడెంట్ శేఖర్, కోశాధికారి మౌలా, గ్యారేజ్ కార్యదర్శి సుధాకర్ కండక్టర్లు అమ్ములు, సరస్వతి, సుబ్బయ్య, శంకరయ్య, పరశురాం, జాఫర్ వల్లి, సుధాకర్, రఫీ, అంకయ్య, ప్రతాప్, నాయక్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

33/11 కెవి లైన్లకు సమీపంలోని కంప చెట్లు తొలగించే కార్యక్రమం, మరమత్తులు చేపడుతుండటం వల్ల తాళ్ళపాక, ఆకేపాడు, సరస్వతిపురం, రెడ్డిపల్లి సబ్ స్టేషన్, వీటి పరిధిలో ఉన్న పరిసర గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా శనివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు నిలిపి వేయనున్నట్లు ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ ఎం.సురేంద్రనాథ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగ దారులు గమనించి విద్యుత్ సంస్థకు సహకరించాలని కోరారు.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 151/2021

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆకేపాడు, రెప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్.

...వాది

వర్సెస్

1. పర్నా బుస్యేంద్ర బాబు తండ్రి చెన్నకృష్ణయ్య నివాసం సి.పి.డ్యామ్, పులపుత్తూరు గ్రామం & పోస్ట్, రాజంపేట మండలం.
2. కటారు అమరయ్య తండ్రి కదిరప్ప నివాసం పులపుత్తూరు గ్రామం & పోస్ట్, రాజంపేట మండలం.

...1,2 ప్రతివాదులు

వాది , బ్యాంక్ వారు బ్యాంక్ లోను వసూలు నిమిత్తం దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు కేసు వాయిదా 14.03.2023 తేదీ ఉదయం 10.30 గంటలకు మీరు పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఖండితంగా తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

జి.రామ చంద్ర, బి.కాం., బి.ఎల్.,
వాదిపరం అడ్వకేట్,
రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No : 89/2022

IDBI బ్యాంక్, రాజంపేట రెప్రెజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్.

...వాది

వర్సెస్

పట్టెం సుబ్బమ్మ తండ్రి లేట్ లక్ష్మయ్య, దేవసముద్రం గ్రామం, వి.అగ్రహారం పోస్ట్, రాజంపేట మండలం అన్నమయ్య జిల్లా.

...ప్రతివాది నెంబర్ 5

వాది, బ్యాంక్ వారు బ్యాంక్ లోను వసూలు నిమిత్తం దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు కేసు వాయిదా 13.03 2023 తేదీ ఉదయం 10.30 గంటలకు మీరుపై కోర్టులో హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట శ్రీ కోర్టు వారు మీ పరోక్షమందు తీర్మానించబడునని ఖండితంగా తెలపడమైనది.

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్ట్//

జి.రామ చంద్ర, బి.కాం., బి.ఎల్.,
వాదిపరం అడ్వకేట్,
రాజంపేట.

మహారాజశ్రీ రాజంపేట జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No : 93/2022

1.పచ్చిపులుసు విశ్వేశ్వర రావు తండ్రి రాజగోపాల్
2.పచ్చిపులుసు కల్యాణి భర్త విశ్వేశ్వరరావు,పొట్టి శ్రీరాములు వీధి, రాజంపేట టౌన్ & మండలం కడప జిల్లా.

...వాదులు

వర్సెస్

పొట్టేటి శివానందం తండ్రి రామచంద్రయ్య, జాండ్రపేట వీధి, మన్నూరు,రాజంపేట టౌన్ &మండలం కడప జిల్లా.

...ప్రతివాది

పై కనబరిచిన వాదులు, దావా ఆస్థిని తమ స్వాధీనం చేయమని మరియు అద్దె బకాయిని చెల్లించమని మరియు దావా ఆస్తిని ఖాళీ చేసే వరకు నెలవారీ అద్దెను తమ అకౌంట్లో జమ చేయవలనని కోరుతూ నీపై దావా దాఖలు చేసి యున్నారు.ఆక్షేపణలున్న ఎడల 21.03.2023 తేదీన ఉదయం 10.30 గంటలకు పై కోర్టులో స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మనవి చేసుకోవలెను. లేనంతట మీ పరోక్షమున తీర్మానించబడును

//బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

పి.ఆనంద కుమార్
వాదులపరం అడ్వకేట్
రాజంపేట

రెడ్యంను పరామర్శించిన డిఎల్

ప్రజాశక్తి-ఖాజీపేట

టిడిపి నాయకుడు వెంకటసుబ్బారెడ్డిని శుక్రవారం మాజీ మంత్రి డిఎల్.రవీంద్రారెడ్డి ఫోన్ ద్వారా పరామర్శించినట్లు తెలిసింది. ఇటీవల గుండెపోటుకు గురై కడప నగరంలోని అరుణాచలం ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం తిరుపతిలోని తన కుమార్తె మౌనికారెడ్డి నివాసంలో విశ్రాంతి పొందుతున్నారు. ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, సంబంధిత వైద్యులతో మాట్లాడుతానని డిఎల్ రెడ్యంకు తెలిపినట్లు సమాచారం.

NAME CHANGE

Sheik Humayun Basha, S/o. Abdul Sukur Saheb Sheik (Old Names) Shall be hence both be known A.S.Humayun, S/o. S.A.Shukur Saheb (New Names)

NAME CHANGE

SHAIK SAIRABANU, W/o Humayun Sheik (Old Names) Shall be Hence Both be Known ATTAR SHAIK SAIRABHANU, W/O A S HUMAYUN (NEW NAMES)